## క్లుప్తంగా

### ప్రతిభావంతులకు నగదు ప్రోత్సాహకాలు



నగదు ప్రోత్సాహాలు అందిస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు

**పి.గన్నవరం:** మానేపల్లి జెడ్పీ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలకు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులకు శనివారం హెల్పింగ్ హ్యాండ్స్ పూర్వ విద్యార్థులు నగదు ప్రోత్సాహాలను అందజేశారు. 2023–24లో ఇంగ్లిషు, తెలుగు మీడియంలో ఉత్తమ ప్రతిభ చూపిన ఆరుగురు విద్యార్థులకు రూ.17 వేల నగదు ప్రోత్సాహాలను అందజేశారు. విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు దేవళ్ల శ్రీనివాస్, ఉచ్చుల బాలమురళీకృష్ణ కోరారు. కార్యక్రమంలో ఉప్పే జగదీష్, పితాని శ్రీనివాసరావు, కంకటాల శ్రీనివాసరావు, ఆరుమిల్లి శ్రీనివాసు, కిశోర్, మర్రెడ్డి వెంకటేశ్వరరావు, దొమ్మేటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

### అయినవిల్లి ఎస్సైగా కేఎం జోషి



అయినవిల్లి ఎస్సైగా కేఎం జోషి

**అయినవిల్లి:** స్థానిక ఎస్సైగా కేఎం జోషి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఉప్పలగుప్తం ఎస్సైగా పనిచేసి బదిలీపై అయినవిల్లికి వచ్చారు. ఇప్పటి వరకూ ఎస్సైగా పనిచేసిన వి.రాజేష్‌కుమార్ రాజోలు ఎస్సైగా బదిలీపై వెళ్లాడు. ఎస్సై జోషికి పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు, పోలీస్‌స్టేషన్ సిబ్బంది కలసి పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. ఎస్సై జోషి మాట్లాడుతూ ప్రజలకు అవగాహన కల్పించి శాంతి భద్రతలు కాపాడతానన్నారు.

### విఘ్నేశ్వరుని సన్నిధిలో సివిల్ కోర్టు జడ్జి

**అయినవిల్లి:** అయినవిల్లి విఘ్నేశ్వరస్వామిని అమలాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి వి.గౌరీశంకర్ శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. జడ్జి గౌరీ శంకర్ స్వామికి విశేష పూజలు జరిపారు. ప్రత్యేక పూజల అనంతరం ఆలయ అర్చకులు స్వామివారి ఆశీర్వాదం అందజేసి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

### ఎంఈఓకు సత్కారం



పి.గన్నవరంలో ఎంఈఓ కోన హెలీనాను సత్కరిస్తున్న నాయకులు

**పి.గన్నవరం:** స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈఓ కోన హెలీనాను నాగుల్లంక స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయులు శనివారం సత్కరించారు. విద్యా రంగానికి హెలీనా విశేష సేవలు అందిస్తున్నారని వారు అభినందించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి-2 చింతా వీరభద్రానందం, స్కూలు కాంప్లెక్స్ చైర్మన్ అనిల్‌కుమార్, జాయింట్ సెక్రటరీ ఎండీ మొహిద్దీన్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

### యువకుడి గల్లంతు

**ఆత్రేయపురం:** మండలంలోని మెర్లపాలెం గ్రామానికి చెందిన ముత్యాల శ్రీను (40) శుక్రవారం రాత్రి బహిర్భూమికి వెళ్లి కాలువలో గల్లంతయ్యాడు. ఆత్రేయపురం మండలం బొబ్బర్లంక–ముక్తేశ్వరం ప్రధాన కాలువలో కాలుజారి గల్లంతయ్యాడు. దీంతో బంధువులు ముత్యాల శ్రీను ఆచూకీ కోసం జాలర్ల సాయంతో ముక్తేశ్వరం పంట కాలువలో గాలింపు చర్యలు చేపట్టారు.

### తైక్వాండో విజేతలకు అభినందనలు



తైక్వాండో విజేతలను అభినందిస్తున్న సీఐ నరేష్‌కుమార్

**రాజోలు:** తైక్వాండో పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులను రాజోలు సీఐ నరేష్‌కుమార్ అభినందించారు. శనివారం ముదునూరి అక్కిరాజు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తైక్వాండో క్రీడాకారులకు అభినందన సభ నిర్వహించారు. ఇటీవల తాడిపత్రిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో సీహెచ్ ధరణి బంగారు పతకం సాధించి జాతీయ పోటీలకు ఎంపికైంది. అలాగే వై.శశిరేఖ, గంగాభవాని, డి.జాహ్నవిచౌదరిలు వెండి పతకాలు సాధించగా ఎ.విజయ్‌కుమార్, కె.దివ్యతేజ వెంకటేషలు కాంస్య పతకాలు సాధించారు. సీఐ నరేష్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి చూపాలన్నారు. టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బోళ్ల వెంకటరమణ, ముదునూరి అక్కిరాజు ట్రస్ట్ వ్యవస్థాపకులు ముదునూరి లతేంద్రవర్మ, డి.మురళి, కోచ్ మణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

---



### రక్షణ లేకుంటే విధులు కష్టం

విధులు నిర్వరించే చోట భద్రత లేకుంటే చాలా కష్టం. పగలు రాత్రి తేడా లేకుండా ప్రజల ప్రాణాలను, ఆరోగ్యాన్ని కాపాడేందుకు వైద్యులు శ్రమిస్తుంటారు. అలాంటి వైద్యుల మాన, ప్రాణాలకు రక్షణ లేకుంటే ఎలా? ప్రభుత్వాలు వైద్యుల రక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. చాలా చోట్ల మహిళా వైద్యులు, వైద్య సిబ్బంది రాత్రి వేళల్లో కూడా విధులు నిర్వరిస్తుంటారు. అలాంటి వారికి రక్షణ కల్పించాలి.

– ఎ.ఇంద్రావతి, వైద్యురాలు, పీహెచ్‌సీ, ముక్కామల



### చట్టాలు కఠినతరం కావాలి



దాడులకు పాల్పడే వారిపై అమలవుతున్న చట్టాలు మరింత కఠినతరం కావాలి. వైద్య సేవలందిస్తున్న డాక్టర్లపై దాడులకు పాల్పడే వారిపై చర్యలకు చట్టాలు, న్యాయస్థానాలు ఉపేక్షించకూడదు. ఇలాంటి కేసులకు న్యాయపరంగా సత్వర తీర్పులు రావాలి. దాడులకు గురైన వారికి, వారి కుటుంబ సభ్యులకు అండగా నిలిచి, మనోధైర్యాన్ని నింపడంలో అందరూ ఏకమవ్వాలి. బాధితులకు న్యాయం చేయడంలో ప్రాధాన్యం ఇవ్వాలి.

– వి.గౌతమి, వైద్యురాలు, పీహెచ్‌సీ, అంబాజీపేట

# తల్లీబిడ్డకు రక్షణ కవచం

- పీఎంఎంవీవై కింద రూ.ఐదు వేల సాయం
- గర్భిణులకు మూడు విడతలుగా చెల్లింపు
- మలికాన్పులో ఆడపిల్ల పుట్టినా ఈ పథకం వర్తింపు



పెదపళ్ల పీహెచ్‌సీలో గర్భిణిని పరీక్షిస్తున్న వైద్యాధికారి సాయికిషోర్

**ఆలమూరు:** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన (పీఎంఎంవీవై) మాతా శిశుసంరక్షణ కోసం దోహదపడుతుంది. పేద, మధ్య తరగతి చెందిన గర్భిణులకు పీఎంఎంవీవై పథకం వరంలా మారింది. ఈ పథకాన్ని 2010లో అప్పటి కేంద్ర ప్రభుత్వం ఇందిరా గాంధీ మాతృత్వ సహయోగ్ యోజన (ఐజీఎంఎస్వై) పథకంగా ప్రారంభించబడింది. ప్రధాని నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చిన తరువాత 2016లో ఆ పథకం ప్రధాన మంత్రి మాతృత్వ వందన యోజన (పీఎంఎంవీవై)గా రూపాంతరం చెందింది. ఈ పథకం మరింత మందికి లబ్ధి చేకూరాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంది. పీఎంఎంవీవై పథకాన్ని పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి మరిన్ని మార్పులు చేసిన తరువాత అమల్లోకి తీసుకు వచ్చింది. పీఎంఎంవీవై ద్వారా అందించే నగదు ప్రోత్సాహకాల ద్వారా గర్భిణులు, బాలింతల్లో మెరుగైన ఆరోగ్య కల్పనకు, నవజాత శిశువు సంరక్షణకు, వ్యాధుల నివారణకు ఉపయోగపడుతుంది. కొత్తపేట, పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గాల్లో ప్రస్తుతం ఉన్న 24 పీహెచ్‌సీల పరిధిలో 4768 మంది గర్భిణులు ఉన్నట్లు జిల్లా వైద్యారోగ్యశాఖ గణాంకాలను బట్టి తెలుస్తోంది. ఈ గర్భిణులందరికీ పీఎంఎంవీవై పథకాన్ని వర్తింపజేసే విధంగా ఆరోగ్య సిబ్బంది నమోదు ప్రక్రియను నిరంతరం నిర్వహిస్తున్నారు. దీంతో పాటు గత మూడేళ్లగా నమోదు చేసుకోని చిన్నారుల తల్లులకు కూడా ఈ పథకాన్ని వర్తింపచేస్తున్నట్లు వైద్యాధికారులు చెబుతున్నారు. దీంతో ఈ పథకం ద్వారా లబ్ధి పొందే మహిళల సంఖ్య సుమారు పది వేలకు మించి ఉంటుందని తెలుస్తోంది. రెండో కాన్పులో ఆడపిల్ల పుడితే ఈ పథకాన్ని వర్తింపజేసేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని కొత్తపేట అడిషనల్ డీఎంహెచ్‌ఓ ఎం.సుమలత తెలిపారు.

**పీఎంఎంవీవై పథకానికి కావాల్సిన అర్హతలు**

- గర్భం దాల్చిన మూడు నెలల్లోపు పీఎంఎంవీవై పథకం కోసం గ్రామ సచివాలయంలోని వెల్‌నెస్ సెంటర్‌లో పేరును నమోదు చేయించుకోవాలి.
- 19 సంవత్సరాలు నిండిన తరువాత గర్భం దాల్చిన మహిళలకే ఈ పథకం వర్తిస్తుంది.
- గర్భిణులు తప్పనిసరిగా మదర్ చైల్డ్ ప్రొటెక్షన్ (ఎంసీపీ) కార్డు కలిగి ఉండాలి.



ఎంసీపీ కార్డు

- పీహెచ్‌సీల్లో ప్రతి నెలా తొమ్మిది దిన నిర్వహించిన పీఎంఎంఎస్వై శిబిరంలో పరీక్షలు చేయించుకోవాలి.

**పీఎంఎంవీవై పథకం నగదు చెల్లింపులు ఇలా..**

- గర్భం దాల్చిన నాటి నుంచి ప్రసవం పూర్తయ్యే లోపు కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహకంగా మూడు విడతల్లో రూ.ఐదు వేలు చెల్లిస్తారు.
- మొదటి విడతగా రూ.అంగన్‌వాడీ కేంద్రం లేదా గ్రామ సచివాలయంలో గర్భిణిగా నమోదైన వెంటనే రూ.1000 లబ్ధిదారుని బ్యాంకు ఖాతాకు జమ అవుతుంది.
- గర్భం దాల్చిన నాటి నుంచి ఆరు నెలల పాటు క్రమం తప్పకుండా వైద్యుల పర్యవేక్షణ తీసుకున్న గర్భిణికి రెండవ విడతగా రూ.రెండు వేలు అందజేస్తారు.
- గర్భిణికి ప్రసవం అయిన తరువాత మూడో విడతగా రూ రెండు వేలు చెల్లిస్తారు.

### సద్వినియోగం చేసుకోవాలి



కేంద్ర ప్రభుత్వం నవజాత శిశువు, తల్లుల సంరక్షణ కోసం ప్రవేశపెట్టిన పీఎంఎంవీవై పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి. నిర్ణీత సమయంలో గర్భిణుల వివరాలు నమోదు చేసుకుని పథకం లబ్ధిని పొందాలి. ఈ పథకంపై గ్రామాల్లో ఆరోగ్య, అంగన్‌వాడీలకు అవగాహన కల్పించాం.

– పి.ఉమ, హెల్త్ విజిటర్, పెదపళ్ల

### ప్రభుత్వాస్పత్రుల్లోనే ప్రసవాలు చేయించుకోవాలి



పీహెచ్‌సీకి వచ్చే గర్భిణులకు చక్కని వైద్య సేవలను అందిస్తున్నాం. ఎంసీపీ కార్డులోని సమాచారాన్ని బట్టి వైద్య సేవలను అందిస్తున్నాం. అపార అనుభవజ్ఞులైన వైద్యులు, స్టాఫ్ నర్సులు ఉన్న ప్రభుత్వ ఆస్పత్రుల్లోని గర్భిణులు ప్రసవాలు చేయించుకోవాలి. దీంతో తల్లి, బిడ్డకు ఎల్లప్పుడు మెరుగైన వైద్యసేవలకు అందించే వీలు కలుగుతుంది.

– ఎ.రత్నకుమారి, స్టాఫ్ నర్సు, పీహెచ్‌సీ, పెదపళ్ల

### విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నాం



పీఎంఎంవీవై పథకం ఆవశ్యకత, గర్భిణులకు కలిగే ప్రయోజనాలపై విరివిగా అవగాహన కల్పిస్తున్నాం. అర్హులందరికీ ఈపథకం అందించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నాము. గర్భిణిగా నమోదు చేసిన ప్రతి ఒక్కరికి ఎంసీపీ కార్డు అందజేస్తున్నాం.

– వి.సువర్చల, ఎంఎల్‌హెచ్‌పీ, చింతలూరు

### తాళ్లమ్మకు గాజుల అలంకరణ



గాజుల అలంకరణలో తాళ్లమ్మ

**కొత్తపేట:** స్థానిక కమ్మిరెడ్డిపాలెం గ్రామ దేవత తాళ్లమ్మ అమ్మవారిని శనివారం గాజులతో అలంకరించారు. శ్రావణమాసం సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు మిద్దే సత్యనారాయణ, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆసాదులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మొత్తం అమ్మవారి విగ్రహానికి గాజులు అలంకరించారు. కమ్మిరెడ్డిపాలెం పరిసర ప్రాంతాల భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

### సీహెచ్‌సీ అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం

**ఆలమూరు:** స్థానిక సామాజిక ఆస్పత్రి(సీహెచ్‌సీ) అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి అన్ని చర్యలు తీసుకుంటామని మండల ఇటుక బట్టీ అసోసియేషన్ ప్రకటించింది. ఈనెల 22న 'సాక్షి' దిన పత్రికలో వైద్యులపై దౌర్జన్యకాండ అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఆస్పత్రిలో కనీస మౌలిక సదుపాయాల కల్పన, నేరాల నియంత్రణకు రూ.65 వేలతో ఎనిమిది సీసీ కెమెరాలు, నాలుగు సీలింగ్ ఫ్యాన్‌లను ఏర్పాటు చేశామని మండల శాఖ అధ్యక్షుడు చల్లా ప్రభాకరరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ ఈదల నల్లబాబు తెలిపారు. ఆకతాయిల ఆగడాలను నియంత్రించడానికి ప్రతి రోజు పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించేందుకు ఎస్సై ఎం.అశోక్ హామీ ఇచ్చినట్లు సూపరింటెండెంట్ పి.గోపిరామ్ పేర్కొన్నారు.

## ముంపుబారిన పడిన పంట పొలాలు



మామిడికుదురులో చెరువును తలపిస్తున్న పంట పొలాలు

**మామిడికుదురు:** మామిడికుదురులో శనివారం భారీ వర్షం కురిసింది. దీంతో పంట పొలాలు ముంపుబారిన పడి చెరువులను తలపించాయి. షిర్డీ సాయిబాబా ఆలయం సమీపంలో సుమారు 100 ఎకరాల్లో పంట నీట మునిగిందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. 216వ నంబర్ జాతీయ రహదారి బైపాస్ పనులు చురుగ్గా నిర్వహిస్తున్నారు. ఆ పనుల్లో భాగంగా ముంపు నీటి మళ్లింపు మార్గం మూసి వేయడంతో పంట పొలాలు ముంపునకు గురయ్యాయని రైతులు వాపోయారు. రైతుల ఆందోళనతో స్పందించిన సంబంధిత ఉద్యోగులు ముంపు నీటి మళ్లింపునకు చర్యలు చేపట్టారు. ముంపు నీటిని వాడ్రేవుపల్లి మీడియం డ్రైన్‌లోకి మళ్లించేందుకు జేసీబీతో డ్రైన్ తవ్వకం పనులు చేపట్టారు. ఆ డ్రైన్ ద్వారా ముంపు నీటిని మళ్లించేందుకు కార్యాచరణ చేపట్టడంతో రైతులు శాంతించారు. ఇదిలా ఉండగా గత రెండు రోజుల నుంచి మండలంలో కురుస్తున్న భారీ వర్షాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలు కాలనీలు నీట మునిగాయి. నగరం నుంచి పాశర్లపూడిబాడవ వరక 216వ నంబర్ జాతీయ రహదారిపై పలు చోట్ల భారీగా ముంపు నీరు నిలిచిపోయింది. దీంతో వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు.

## సంతానలేమి, స్త్రీల వ్యాధులకు ఉచిత వైద్య సేవలు



రావులపాలెం సత్యసాయి మందిరంలో స్త్రీలను పరీక్షిస్తున్న ప్రదీప్తికరుణ

**కొత్తపేట/రావులపాలెం:** రావులపాలెం సత్యసాయి సేవా కేంద్రంలో శనివారం సంతానలేమి, స్త్రీల వ్యాధుల ఉచిత వైద్య సేవా శిబిరం నిర్వహించారు. కొత్తపేట భాస్కర ఐవీఎఫ్ ఫెర్టిలిటీ సెంటర్ మొదటి వార్షికోత్సవం సందర్భంగా ఆ సెంటర్ సౌజన్యంతో ప్రముఖ గైనకాలజిస్టు, ఐవీఎఫ్ ఫెర్టిలిటీ సెంటర్ స్పెషలిస్టు డాక్టర్ ప్రదీప్తికరుణతో పాటు రాజమహేంద్రవరానికి చెందిన ఐవీఎఫ్ స్పెషలిస్టు ఫెర్టిలిటీ డాక్టర్ లక్ష్మీప్రసన్న, డివిజన్ వైద్యాధికారి ఎం.సుమలత అనారోగ్య రుగ్మతలతో బాధపడుతున్న 64 మందికి వివిధ పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. సంతానలేమి సమస్యలకు సంబంధించిన 30 మంది దంపతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఉచితంగా మందులు అందజేశారు. సేవా కేంద్రం కోఆర్డినేటర్ మన్యం వర్ధనరావు తెలిపారు. ముందుగా ఈ వైద్య శిబిరాన్ని రావులపాలెం అష్టదళ సేవా పుష్పం ట్రస్ట్ చైర్మన్ ప్రారంభించగా, కొత్తపేట భాస్కర మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ అధినేత డాక్టర్ మెంటే ఉదయభాస్కరరావు జ్యోతిప్రజ్వలన చేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవాదళ్ సభ్యులు నడింపల్లి రామకృష్ణంరాజు, మన్యం పర్వతవర్ధనరావు, సిద్ధిరెడ్డి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. కొత్తపేట ఐవీఎఫ్ సెంటర్, భాస్కర ఆస్పత్రి సిబ్బంది సేవలందించారు.

## ఉపాధి ఆడిట్‌లో రూ.1.16 లక్షల రికవరీకి ఆదేశం

**పి.గన్నవరం:** గత ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం కింద మండలంలో నిర్వహించిన పనులకు గాను రూ.1.16 లక్షలు తేడా ఉన్నట్టు గుర్తించి, ఆ సొమ్మును సంబంధిత వ్యక్తుల నుంచి రికవరీ చేయాలని డ్వామా పీడీ మధుసూదనరావు ఆదేశించారు. మండలంలో 2023–24 సంవత్సరానికి గాను మొత్తం రూ.8,31,13,642ల మేర ఖర్చు చేశారు. ఇందులో రూ.8,16,60,139లను కూలీలకు వేతనాలుగా, రూ.14,53,503లు మెటీరియల్‌కు చెల్లించారు. ఈ పనులపై గ్రామాల్లో ఇటీవల సామాజిక తనిఖీ చేశారు. అయితే ఉపాధి హామీ పనులకు సంబంధించి రూ.85,000, పంచాయతీ రాజ్‌కు సంబంధించి రూ.31,000 తేడాలు ఉన్నట్టు గుర్తించారు. ఈ సొమ్మును రికవరీ చేయాలని పీడీ మధుసూదనరావు ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ ఎటువంటి అక్రమాలకు తావివ్వకుండా ప్రజలకు మేలు చేసే విధంగా ఉపాధి పనులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి భీమేశ్వర్, అంబుడ్స్‌మన్ మల్లికార్జున్, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, ఎంపీడీఓ ఎం.భారతి, ఏపీఓ సీహెచ్ లక్ష్మీ నారాయణ, సీఆర్‌పీ కనకారావు తదితరులు పాల్గొన్నారు.

**ఉపాధి కూలీల ఆందోళన**

**పి.గన్నవరం:** మండలంలోని ఎల్.గన్నవరంలో ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి స్థానిక జనసేన పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధులు రాజకీయం చేస్తున్నారని ఆరోపిస్తూ ఆ గ్రామానికి చెందిన ఉపాధి కూలీలు శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఉపాధి పనుల సామాజిక తనిఖీపై ప్రజావేదిక కార్యక్రమం నిర్వహిస్తుండగా, ఆ ప్రాంతానికి సుమారు 100 మంది కూలీలు వచ్చి ఆందోళన నిర్వహించారు. ఉపాధి కూలీలకు అన్యాయం జరిగే విధంగా తమ గ్రామ ప్రజా ప్రతినిధులు వ్యవహరిస్తున్నారని వారు ఆరోపించారు. తమ గ్రామంలో ఉపాధి పనుల్లో రాజకీయాలకు తావు లేకుండా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను కోరారు. అనంతరం ఎంపీపీ, సర్పంచ్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేస్తూ వెనుదిరిగారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యన్నాబత్తుల వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు యన్నాబత్తుల ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



అంబాజీపేటలో రోగులకు వైద్య పరీక్షలు అందిస్తున్న డాక్టర్ సలోమాన్

**అంబాజీపేట:** గ్రామీణ ప్రాంత పేద ప్రజల ఆరోగ్య సంరక్షణలో భాగంగా నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని తమిళనాడు వేలూరుకు చెందిన స్కడ్డర్ మెమోరియల్ ఆసుపత్రి వైద్యుడు రూప్ సలోమాన్ అన్నారు. అంబాజీపేట స్త్రీల ఆసుపత్రి 58వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం ఆసుపత్రి ఆవరణలో సాధారణ, దంత వైద్య విభాగాల్లో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని ఆసుపత్రి సీఈఓ డాక్టర్ ఎస్ఆర్‌డీ హెవార్డురాజ్ ప్రారంభించారు. సాధారణ వైద్య విభాగంలో 54 మంది రోగులకు సలోమాన్, దంత వైద్య విభాగంలో 21 మంది రోగులకు డాక్టర్ షైనీరూప్ సలోమాన్ వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా 52 మందికి వివిధ పరీక్షలు నిర్వహించి రూ.5,200 విలువైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ షెనీ సరెల్లా, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**దోమల నివారణతోనే సంపూర్ణ ఆరోగ్యం**

ప్రస్తుత వాతావరణంలో దోమలు విపరీతంగా పెరిగి పోవడం వల్ల డెంగీ, మలేరియా, విష జ్వరాలు ప్రబలుతున్నాయని వాటిని అరికడితే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని ముక్కామల పీహెచ్‌సీ వైద్యాధికారి ఎ.ఇంద్రావతి అన్నారు. పుల్లేటికుర్రు శివారు లంకతోటలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఇంద్రావతి మాట్లాడుతూ రెండు రోజులు కంటే జ్వరం, దగ్గు, జలుబు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించి మెరుగైన వైద్యం తీసుకోవాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. అనంతరం రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

**సీజనల్ వ్యాధుల నివారణకు ప్రత్యేక కృషి చేయాలి**

**ఆలమూరు:** మండలంలోని పెదపళ్ల పీహెచ్‌సీ పరిధిలో సీజనల్ వ్యాధుల నివారణకు తోడ్పాటును అందించడంతో పాటు ఆయుష్మాన్ భారత్ సేవలు ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సాయికిషోర్ అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో శనివారం వైద్య ఆరోగ్య సిబ్బందికి సెక్టార్ సమావేశం జరిగింది. ఆగస్టు నెలలో సాధించిన ప్రగతిని అధికారులకు ఆరోగ్య సిబ్బంది వివరించారు. అనంతరం సబ్‌సెంటర్ల వారీగా వైద్యాధికారులు రికార్డులను తనిఖీ చేసి పలు సూచనలు, సలహాలను అందజేశారు. సీహెచ్‌ఓ పి.రాధాకృష్ణ, హెల్త్ ఎడ్యుకేటర్, ఏవీవీ రాజా సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.ఉమ, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.


## మెనూ ప్రకారం ఆహారం అందించాలి



అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు భోజనం వడ్డీస్తున్న ఎంపీపీ వెంకటేశ్వరరావు

**అంబాజీపేట:** మెనూ ప్రకారం విద్యార్థులకు ప్రతి రోజు పౌష్టికాహారాన్ని రుచిగా అందించాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంఈఓ–2 మోకా ప్రకాష్‌తో కలసి శనివారం పరిశీలించారు. ఎంపీపీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వంట చేసే ప్రాంతమంతా పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అలాగే విద్యార్థులకు పెట్టే భోజనంలో నాణ్యత ప్రమాణాలు పాటించి రుచిగా ఉండేలా చూడాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించి తాగు నీరు విషయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. విద్యార్థులకు భోజనాన్ని వడ్డించి నాణ్యత, రుచిపై ఆరా తీశారు. అనంతరం పాఠశాలలో జరుగుతున్న అదనపు తరగతి భవన నిర్మాణ పనులను హెచ్ఎం కడలి సాయిరామ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఎంపీపీ వెంట ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## లక్కవరం పీఏసీఎస్ వ్యవహార శైలిపై ఎమ్మెల్యేకు ఫిర్యాదు



ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌కు ఫిర్యాదు చేస్తున్న లక్కవరం పీఏసీఎస్ సభ్యులు

**మలికిపురం:** మండలంలోని లక్కవరం పీఏసీఎస్ వ్యవహార శైలిపై శనివారం సదరు సంఘ సభ్యులు, రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌కు ఫిర్యాదు అందజేశారు. లక్కవరం సొసైటీలో 2023 నవంబరు 5న ఆదివారం కార్యాలయ తలుపులు తీసి ఉంచడం వల్ల సొసైటీలోని క్యాష్‌బుక్, ఓచర్లు, రశీదు పుస్తకాలు చించివేసి, సొసైటీ వద్ద ఉన్న గోల్డ్ లోన్ పుస్తకాలు సంఘ గొడౌన్ నందు దాచేశారని ఆ ఫిర్యాదులో వారు పేర్కొన్నారు. అలాగే కంప్యూటర్ సీపీయూ కూడా దొంగిలించారన్నారు. సొసైటీ స్థల దాతలు, మాజీ సంఘ అధ్యక్షుడి ఫొటోలకు పేడ అంటించారన్నారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు వేలి ముద్రలు అన్నీ పరిశీలించారన్నారు. ఇది అంతా సీఈవో నారిన పుల్లేశ్వరరావు చేసినట్లుగా నిర్ధారణ చేశారని ఆ ఫిర్యాదులో వారు తెలిపారు. తమ సంఘ నిధులను పక్కదారి మళ్లించి, తమకు సరైన సమాధానం దక్కక పోవడం చేత, తమకు ఈ విషయంలో పూర్తి న్యాయం చేయాలని ఎమ్మెల్యేను ఆ ఫిర్యాదులో వారు మొరపెట్టుకున్నారు. వై.నాగేశ్వరరావు, ఎంవీ నరసింహారావు, ఎన్.పెద్దిరాజు, ఎం.వెంకట్రావు, పి.నాగేశ్వరరావు, ఎంఎస్ఎన్ రాజు ఆ ఫిర్యాదులో సంతకాలు చేసిన వారిలో ఉన్నారు.

## మరుగుదొడ్ల ఫొటోలు తీసే బాధ్యత మినహాయించాలి

**రాజోలు:** మరుగుదొడ్ల ఫొటోలు తీసే బాధ్యతల నుంచి వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లను మినహాయించాలని వెల్ఫేర్ అసిస్టెంట్లు శనివారం ఎంపీడీఓ ఎస్.బాలాజీకి వినతిపత్రాన్ని అందజేశారు. సచివాలయంలో సంక్షేమ పథకాల బాధ్యతలు నిర్వహిస్తున్న తమకు అదనపు పని భారం మోపడం తగదన్నారు. ఉపాధ్యాయులు వ్యతిరేకించిన పనులను వెల్ఫేర్ అసిస్టెంట్లకు అప్పగించడం ఎంతవరకు సమంజసమన్నారు. తక్షణం పాఠశాలల్లో మరుగుదొడ్ల ఫొటోలు తీసే బాధ్యత వెల్ఫేర్ అసిస్టెంట్లకు అప్పగిస్తూ ఇచ్చిన ప్రభుత్వ ఉత్తర్వులను తక్షణం ఉపసంహరించుకోవాలని కోరారు.

## వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు

**అంబాజీపేట:** స్థానిక కొర్లపాటివారిపాలెంలో వేంచేసిన వేంకటేశ్వర స్వామి వారి ఆలయం శనివారం భక్తులతో పోటెత్తింది. ఏడుకొండల స్వామి ఐదు వారాలు దర్శించుకుంటే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. తొలుత స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

**అయినవిల్లి:** అయినవిల్లి మండలంలోని నల్లచెరువులో వేంచేసిన అలమేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో స్వామివారి దర్శనం కోసం శనివారం భక్తులు పోటెత్తారు. స్వామికి ఆలయ వేదపండితులు ఆధ్వర్యంలో తెల్లవారుజామున తోమాల సేవ, అర్చన, నైవేద్యం, నక్షత్ర హారతి, కుంభ హారతి వంటి విశేష పూజలు చేశారు. వేదపండితులు స్వామికి తులసి పూజ చేశారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. స్వామివారికి పటిక బెల్లం తులాభారం నిర్వహించారు.

**మామిడికుదురు:** అప్పనపల్లి బాలబాలాజీ స్వామి ఆలయం శనివారం భక్తులతో కోలాహలంగా మారింది. భారీ వర్షాన్ని సైతం లెక్క చేయకుండా భక్తులు భారీగా తరలి వచ్చారు. స్వామి వారికి వివిధ సేవల ద్వారా రూ.1,94,143 ఆదాయం వచ్చింది. లడ్డూ ప్రసాదం, దర్శనం టికెట్ల విక్రయం ద్వారా రూ.1,28,143 ఆదాయం లభించింది. నిత్య అన్నదానం ట్రస్ట్‌కు భక్తులు రూ.66 వేలు విరాళాలుగా అందించారు. 2,693 మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. 1,875 మంది స్వామి వారి అన్న ప్రసాదం స్వీకరించారు. ఆదుర్రుకు చెందిన పంతాడి కామేశ్వరవర్మ, పద్మలతరాణి దంపతులు రూ.10,116 విరాళంగా అందించారు. వారికి ఆలయ ఉద్యోగులు స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. అప్పనపల్లి బాల బాలాజీ స్వామి దేవస్థానం ఈఓగా వి.సత్యనారాయణను నియమించారు. అంతర్వేది శ్రీలక్ష్మీ నరసింహ స్వామి ఆలయ ఈఓగా విధులు నిర్వహిస్తున్న సత్యనారాయణను ఇక్కడ ఇన్‌చార్జ్‌గా నియమించడంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇంత వరకు ఇక్కడ ఈఓగా పని చేసిన గ్రంధి మాధవి బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో సత్యనారాయణను ఇన్‌చార్జ్ ఈఓగా నియమించారు.